క్లుప్తంగా

మలికిపురం ఎస్సైగా సురేష్



మలికిపురం: స్థానిక ఎస్సైగా పీవీవీఎస్ఎన్ సురేష్ నియమితుల య్యారు. ప్రస్తుతం నగరం ఎస్సైగా పనిచేస్తున్న సురేష్ మలికిపురం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. మలికిపురం ఎస్సైగా పని చేస్తున్న సంపత్‌కుమార్ బదిలీ అయ్యారు.

చేనేత బకాయిలు విడుదల చేయాలి

సఖినేటిపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సంఘాలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీడీపీ చేనేత విభాగం ప్రతినిధి, మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు చింతా వీర భద్రేశ్వరరావు సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన అమరావతిలో చంద్రబాబును కలసి వినతి పత్రం అందించారు. సీఎం సానుకూలంగా స్పందించారని వీర భద్రేశ్వరరావు వివరించారు.

చిత్రపటం బహూకరణ



చెముడులంకలో ఎస్సైకి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దాత, ఇతరులు

ఆలమూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఎస్సై ఎల్.శ్రీనునాయక్‌కు స్వీయ చిత్రపటం బహూకరించారు. రాయవరం మండలంలోని వెదురుపాక జెడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న వి.రాధాకృష్ణ వారం రోజుల పాటు శ్రమించి ఎస్సై శ్రీను నాయక్ ఫొటోను కాన్వాస్ పద్ధతిలో రంగులతో అద్దిన చిత్రపటాన్ని ఎస్సై శ్రీను నాయక్‌కు అందజేశారు. మూడేళ్ల క్రితం రాయవరం ఎస్సైగా పనిచేసి కోవిడ్–19 సమయంలో అనుసరించిన విధి నిర్వహణలో సమగ్రంగా నిర్వహించి అనేక మందికి సకాలంలో టీకాలు వేయించడంతో పాటు ఔషధాల కొరత రానీయకుండా చర్యలు తీసుకున్న ఎస్సై శ్రీనునాయక్‌ను అనేక మంది అభిమానులు అభినందించారు. ఏఎస్సై ఎం.సూర్యచంద్రరావు, కేవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉండకుండా చూడాలి



జి.అగ్రహారంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: మన పరిసరాల్లో వాడకంలో లేని పాత్రలు, సామగ్రిలో ఎటువంటి నీరు నిల్వ లేకుండా చూడాలని లేని పక్షంలో దోమలు విపరీతంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని సీహెచ్ఓ బి.అప్పారావు, ఎస్ఈఓ ఎస్వీ రామారావులు ప్రజలకు వివరించారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జైభీమ్‌నగర్‌లో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. మూడు రోజులు కంటే జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం దోమల నివారణకు ఎబేట్ మందు స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి లీలలు అవగతం కావు

అయినవిల్లి: భగవంతుడైన శ్రీకృష్ణుడి లీలలు ఒక పట్టాన ఎవరికీ అర్థం కావని, శుద్ధ భక్తుడికి మాత్రమే అవగతం అవుతాయని ఆదివారం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు ప్రభూ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. జగన్నాథుడు శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభూ శ్రీకృష్ణుని లీలలను వివరించారు. శుద్ధ భక్తుడు అడుగు జాడల్లో నడిస్తే శ్రీకృష్ణుని తత్వం బోధపడుతోందన్నారు.

ఘనంగా చౌడేశ్వరి వార్షికోత్సవం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వర, గణపతి ఆలయంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పువ్వులు, కుంకుమార్చన తదితర పూజలు ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి మహిళా సమాజం ఆధ్వర్యంలో లలిత సహస్రం నిర్వహించారు.

పశువుల దాణా పంపిణీ

సఖినేటిపల్లి: మండలంలోని వరద ముంపు గ్రామాలైన సఖినేటిపల్లిలంక, అప్పనరామునిలంకలలో ఆదివారం పాడి రైతులకు పశువుల దాణాను పంపిణీ చేశారు. సఖినేటిపల్లిలంకలో రేపూరి ఏసు నరసింహ రాజా, అప్పనరామునిలంకలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు రైతులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌తో వెలుగులు



- సోలార్ ప్యానల్స్ ద్వారా ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి
- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలు
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకునే అవకాశం

కొత్తపేట: రోజురోజుకు విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ బిల్లుల భారం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. ప్రతి నెలా విద్యుత్ బిల్లును చూసి వామ్మో.. ఇంత బిల్లు వచ్చిందా.. అని నోరువెళ్లబెట్టని వారు ఉండరు. అయితే సహజ వనరులను వినియోగించుకుని గుదిబండ లాంటి విద్యుత్ బిల్లుల భారాన్ని దించుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు కల్పిస్తోంది. ఎవరికి వారు తమ ఇంటిపై లేదా ఇంటి ఆవరణలో సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. అందుకు అవసరమైన మేరకు రాయితీ అందిస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది. ఈ ప్రోత్సాహం, విద్యుత్ బిల్లు ఆదాపై విద్యుత్ శాఖ కరపత్రాలు పంపిణీ చేస్తూ వినియోగదారులకు అవగాహన కల్పిస్తోంది.

విద్యుత్ వాడకం మేరకు..

విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్ కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయించిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తున్నారు. ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి, వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుంది.

30 రోజుల్లోనే సబ్సిడీ..

నెట్ మీటరు అమర్చిన తరువాత పోర్టల్లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ (ఒకమీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. కిలో వాట్ సోలార్ రూటాఫ్ ప్యానల్ నెలకు దాదాపు 125 పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూటాప్ ప్యానల్స్‌ను సూర్యుడి వేడి పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి 6 నుంచి 7 ఏళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

దరఖాస్తు ప్రక్రియ ఇలా..

స్టెప్ 1: ముందుగా ఈ పోర్టల్‌లో మీరు పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం

- మీ రాష్ట్రం విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి
- మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్, ఈ మెయిల్‌ను ఎంటర్ చేయాలి
- పోర్టల్లో ఉన్న నియమ నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి.

స్టెప్ 2: ఆ తర్వాత కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన అవ్వాలి. అక్కడ రూఫ్‌టాప్ సోలార్ కోసం అప్‌లై చేయాలి.

స్టెప్ 3: దరఖాస్తు పూర్తి చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చే వరకూ వేచి చూడాలి. అనుమతి వచ్చిన తరువాత మీ డిస్కమ్‌లోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

స్టెప్4: ఇన్‌స్టలేషన్ పూర్తయిన తరువాత ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

స్టెప్ 5: నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక డిస్కమ్ అధికారులు తనిఖీల అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు.

స్టెప్ 6: ఈ రిపోర్టు పొందిన తరువాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్లో సబ్‌మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.



విద్యుత్ శాఖ ప్రచార చిత్రం

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం



వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తోంది. 6–7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. – పి.నరేష్, విద్యుత్ శాఖ ఏఈ, కొత్తపేట

పీఎం సూర్యఘర్ పథకం గృహ వినియోగదారులకు రాయితీ వివరాలు..

వినియోగం (యూనిట్లలో)	సోలార్ కెపాసిటీ (కిలో వాట్లలో)	సబ్సిడీ (రూపాయల్లో)
0–150	1- 2	30 నుంచి 60 వేలు
150–300	2- 3	50 నుంచి 78 వేలు
300 లోపు	3	78 వేలు

నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఈతకోట, పేరవరం విద్యుత సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ కేటగిరీల విద్యుత్ సర్వీసులు

కేటగిరీ	సర్వీసులు
గృహావసర సర్వీసులు	1,01,272
వ్యాపార సర్వీసులు	7,127
కేటగిరీ 3 పరిశ్రమల సర్వీసులు	256
కేటగిరీ 4 పరిశ్రమల సర్వీసులు	1,354
వ్యవసాయ సర్వీసులు	1,10,237

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు సామర్థ్యం (కిలోవాట్లలో)	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (సుమారు)	వినియోగదారులకు వస్తున్న ప్రస్తుత బిల్లు (సుమారు రూపాయల్లో)	సోలార్ ఏర్పాటు తర్వాత వచ్చే బిల్లు (రూపాయల్లో)	ఏడాదికి ఆదా (సుమారు రూపాయల్లో)	ప్రభుత్వ రాయితీ (రూపాయల్లో)
1	120	1000	338	8000	30,000
2	240	2000	333	20000	60000
3	360	3000	293	32400	78000

చిన్నారికి రూ.10 వేల సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలోని అరుంధతీపేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతుంది. ఆమె తండ్రి రమేష్ ఆటో డ్రైవర్. ఆమెకు వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీలో అవకాశం లేదని డాక్టరు చెప్పారు. ఒక్కో ఇంజక్షన్ రూ.85 వేలు. మొత్తం పది ఇంజక్షన్లు చేయాలని చెప్పారని బాలిక తండ్రి రమేష్ వాపోయారు. మూడు నెలల నుంచి బాలిక అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. ఇంత వరకు మూడు ఇంజక్షన్లు చేయించామని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారికి వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేక పోవడంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు రూ.10 వేలు వసూలు చేసి ఆ సహాయాన్ని ఆదివారం బాలిక జ్యోతితో పాటు ఆమె తండ్రి రమేష్, తల్లి శాంతి కుమారికి అందించారు. దాతలు స్వచ్ఛందంగా వచ్చి బాలికకు ఆర్థిక సాయం అందించాలని ఆర్ఎంపీ కంకిపాటి వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో తులా గోపాలకృష్ణ, తులా నాగరాజు, చిన్న, వినయ్, కంకిపాటి నాగేశ్వరరావు, తులా బ్రహ్మాజీ, అల్లూరి సుబ్బరాజు, స్థానికులు పాల్గొన్నారు.

వరదనీటిలో రాకపోకలు



కనకాయలంక కాజ్‌వేపై వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పి.గన్నవరం: చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి తగ్గడంతో ఆదివారం నుంచి పడవలను నిలిపివేశారు. కాజ్‌వేపై అడుగున్నర ఎత్తున వరద ప్రవహిస్తోంది. దీంతో లంక ప్రజలు వరదనీటిలో కాలినడకన వెళ్తున్నారు. అలాగే మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



చింతలూరులో శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



మొగలికుదురులో శాకంబరి అవతారంలో పళ్లాలమ్మ



గంగలకుర్రులో శాకంబరిగా రావులమ్మ

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, పలువురు భక్తుల ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు అమ్మవారిని కాయగూరలు, ఆకు కూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వానపల్లి పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గంగలకుర్రులో..

అంబాజీపేట: ఆషాఢమాసం అమావాస్యను పురస్కరించుకుని గంగలకుర్రులో వేంచేసిన గ్రామ దేవత రావులమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో అమ్మవారికి వివిధ రకాల కాయకూరలు, పండ్లతో రావులమ్మను శాకంబరిగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మొగలికుదురులో..

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ దేవత పళ్లాలమ్మ తల్లిని ఆషాఢమాసం అయిదో ఆదివారం శాకంబరి దేవిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పళ్లాలమ్మా... కరుణించమ్మా... అంటూ ఆ మహి మాన్వితురాలిగా పేరు పొందిన అమ్మ వారిని వేడుకున్నారు.

చింతలూరులో..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన దుర్గాదేవి అమ్మవారు ఆదివారం శాకంబరీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో ఏటా శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీ. అందులో భాగంగా శ్రీక్రోధ నామ సంవత్సర ఆషాఢ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని గుప్త నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా భక్తబృంద సభ్యులు అమ్మవారిని కాయకూరలు, ఆకుకూరలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నిస్వార్థ స్నేహం శాశ్వతం



అంబాజీపేట హైస్కూల్లో కలుసుకున్న స్నేహితులు



కొత్తపేటలో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొంటున్న బాలలు

కొత్తపేట: మానవ జీవితంలోని అన్ని బంధాల్లోనూ నిస్వార్థమైన స్నేహబంధం శాశ్వతంగా నిలుస్తుందని సత్యసాయి సేవా సమితి కన్వీనర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం వివిధ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక సత్యసాయి ప్రశాంతి నిలయంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కేఎస్ఎన్, సమితి సభ్యుల ఆధ్వర్యంలో బాలవికాస్ ఉపాధ్యాయులు మాధవి, అనంతలక్ష్మి, రోజా బాలవికాస్ బాలలతో స్నేహితుల దినోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

స్థానిక వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎన్‌యూకే లింగేశ్వరరావు ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా వాసవీ మాత ఆలయంలో క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి వద్ద ఉంచి పూజించిన ఫ్రెండ్షిప్ బ్యాండ్స్‌ను ఒకరి కొకరు కట్టుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా మండల ముస్లిం నాయకుడు షేక్ గౌస్.. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దెందులూరి జగదీశ్వరప్రసాద్ ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఈ రోజు మంచి రోజు

అంబాజీపేట: అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని అంబాజీపేట మండలంలోని ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకొన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదే పాఠశాలలో కలుసుకుని స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాఠశాల నుంచి విడిపోయి నాలుగు దశాబ్దాల తర్వాత వారందరిని స్నేహం ఒక చేటకు చేర్చింది. కార్యక్రమంలో రవణం వెంకటరావు, సానబోయిన వెంకట సత్యనారాయణ, షరీఫ్, మట్టపర్తి బాలాజీ, నిట్టాల సాయిరామ్, దొమ్మేటి సత్యనారాయణ, యర్రాప్రగడ సుబ్రహ్మణ్యం, పళ్ల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

7న భూముల కౌలుకు వేలం

మామిడికుదురు: అప్పనపల్లిలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చెందిన 3.35 ఎకరాల కొబ్బరి చెట్ల ఫల సాయం తీసుకొనేందుకు ఈ నెల 7వ తేదీ బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు ఆదివారం తెలిపారు. 2024–25 నుంచి 2026–2027 మూడేళ్ల కాల పరిమితికి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు దేవస్థానం వద్ద దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము రూ.25 వేలు, రూ.మూడు లక్షలు విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకుని పాటలో పాల్గొన వలసిందిగా కోరారు. ఇతర వివరాల కోసం కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలన్నారు.

పాఠశాల శ్లాబ్ లీకైపోతుంది

అంబాజీపేట: పసుపల్లి శివారు కమింగ్‌పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాల శిథిలస్థితికి చేరడంతో కొద్దిపాటి వర్షానికి శ్లాబ్ లీకై పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్లాబ్ పైన వర్షపు నీరు నిల్వ ఉండి నీటి చుక్కలు లీకవడం వల్ల పాఠశాలలో ఉన్న రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం సామగ్రి, విద్యార్థులు కూర్చునే బల్లలు తడిచి ముద్దవుతున్నాయని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు నాని శ్లాబ్ ఏ సమయంలో కూలిపోతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. శిథిలస్థితికి చేరిన పాఠశాల భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో ఆదివారం పేకాటరాయుళ్లపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. దాడిలో పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.11,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై బి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అన్నారు.

ఘనంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం అత్యంత వైభవంగా చండీహోమం జరిగింది. ఆలయ ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రతి నెలా అమావాస్య రోజున చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ కృష్ణ తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు స్థానిక దేవదాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాడపల్లిలో తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయ డీసీ, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రైతన్నల అభ్యున్నతికి సహకరించండి



ఆలమూరులో ఎమ్మెల్యే బండారును సత్కరించిన రైసుమిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆలమూరు: జిల్లాలోని రైతన్నల అభ్యున్నతికి రైసు మిల్లర్లు సహకరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోనున్న ఎస్ఆర్‌జే కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే బండారుకు ఆత్మీయ సత్కారం జరిగింది. నియోజకవర్గ రైసుమిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఎమ్మెల్యే బండారు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బకాయి పడ్డ రూ.35 కోట్లను సత్వరమే రైతుల ఖాతాలో జమ చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రైసుమిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యే బండారును ఘనంగా సత్కరించి శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ సభ్యులు ఆకుల రామకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు, రైసుమిల్లర్స్ ప్రతినిధులు వంక సత్యనారాయణ, వంటిపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం



అప్పనపల్లిలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాంబాబు



పాశర్లపూడిలంకలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో బొజ్జిరాజు

మామిడికుదురు: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టామని డీఎల్‌పీఓ బొజ్జిరాజు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో చేపట్టిన శానిటేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోను శానిటేషన్ పనులను ముమ్మరంగా చేపట్టామన్నారు. బ్లీచింగ్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్నామన్నారు. మురుగు నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేయిస్తున్నామని తెలిపారు. ఫాగింగ్ చేయించడంతో పాటు మలాథియాన్ మందును స్ప్రే చేయిస్తునానమని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణకు కార్యాచరణ

మామిడికుదురు: సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు తెలిపారు. అప్పనపల్లిలో నిర్వహిస్తున్న శానిటేషన్ కార్యక్రమాన్ని డీపీఓ ఆదివారం పరిశీలించారు. దోమల వల్ల వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ముంపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా శానిటేషన్‌తో పాటు మలాథియాన్ స్ప్రే, ఫాగింగ్, ఆయిల్‌బాల్స్ విడుదల తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బొజ్జిరాజు, ఈఓపీఆర్డీ ఆచంట శ్రీనివాసరావు, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, కార్యదర్శి సూర్యనారాయణరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనసూయ పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

అయినవిల్లి: ఆస్తి వివాదం నేపథ్యంలో కత్తి పీటతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలంలోని శానపల్లిలంక తూర్పుపేటకు చెందిన తొత్తరమూడి వెంకన్నబాబు, తొత్తరమూడి నాగరాజుల మధ్య శుక్రవారం ఆస్తి వివాదం నేపథ్యంలో గొడవ జరిగింది. దీంతో నాగరాజు కత్తిపీటతో వెంకన్నబాబుపై దాడి చేశాడు. గాయాలపాలైన వెంకన్నబాబును జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నాగరాజును అరెస్టు చేసి అమలాపురంలోని కోర్టుకు తరలించినట్లు తెలపారు. జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాలకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 33 కేవీ విద్యుత్ లైను మరమ్మతులు చేసే నిమిత్తం మందపల్లి, కొత్తపేట పంచాయతీ పరిధిలోని ఏనుగుల మహల్, చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెం, రామారావుపేట, బి.సావరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఈఈ రవికుమార్ కోరారు.